క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కళాకారులకు అభినందన



ఢిల్లీలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న నిర్మలా నృత్యనికేతన్ కళాకారులు

పెందుర్తి: ఢిల్లీలోని ఎర్రకోటలో గత నెల 26న జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నాట్య ప్రదర్శన చేసిన చినముషిడివాడకు చెందిన నిర్మలా నృత్యనికేతన్ కళాకారులను సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. చినముషిడివాడలోని నిర్మలా నృత్యనికేతన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్రం ప్రిన్సిపాల్ బి.వి జయజ్యోతి మాట్లాడుతూ ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో నిర్మల నృత్య నికేతన్ నుంచి ఒకరిద్దరూ పాల్గొనే అవకాశం వచ్చేదన్నారు. కానీ ఈ ఏడాది ఆరుగురు(శర్వాణిరెడ్డి, కార్తిక, ఈక్షిత, పూర్వజరెడ్డి, పూజితరెడ్డి, చిరుమేఘన) కళాకారులు గణతంత్ర దినోత్సవంలో పాల్గొని 'నారి శక్తి' థీమ్ సాంగ్‌కి లంబాడి మహిళాశక్తిగా నర్తించి కేంద్ర ప్రభుత్వ మన్ననలు పొందారన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం దరి విజిని గిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని బిల్వపత్రాలతో అర్చన చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



కళాకండాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు తమ సృజనాత్మకతతో బొమ్మలు, వివిధ కళాకండాలు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా జి.ఎం కె.రమ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ సెకండియర్ పరీక్ష వాయిదా

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 7న జరగాల్సిన ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం మొదటి సెమిస్టర్ బీటెక్, బీఈ, బీఆర్క్ పరీక్షను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 19న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

ప్రగతి పరుగు

- పంచాయతీలోనే అన్ని సేవలు
- అభివృద్ధి పనులతో మారిన రూపురేఖలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న వాడచీపురుపల్లి వాసులు

ఇది కదా అభివృద్ధి



నాడు-నేడులో అభివృద్ధి చేసిన దలాయిపాలెం ఎంపీపీ పాఠశాల



వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ టాయిలెట్ సముదాయం



వాడచీపురుపల్లిలో నిర్మించిన జిమ్, లైబ్రరీ భవనం



నాడు-నేడులో తీర్చిదిద్దిన వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల సముదాయం

వాడచీపురుపల్లి పంచాయతీ జనాభా	11,300
మంజూరు చేసిన అభివృద్ధి పనులు:	40
పూర్తి చేసిన అభివృద్ధి పనులు విలువ:	3.05 కోట్లు
కొనసాగుతున్న అభివృద్ధి పనుల విలువ:	2.89 కోట్లు
సంక్షేమ పథకాలు కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి	రూ. 21.28 కోట్ల జమ

శివారు గ్రామాలు: ఇస్సన్నపేట. వెంకటాపురం, దలాయిపాలెం, పోలిరెడ్డిపాలెం, నర్సాపురం, గొరుసువానిపాలెం, పందివానిపాలెం, ఊటగెడ్డపాలెం

పరవాడ: మండలంలోని మేజరు పంచాయతీల్లో ఒకటి వాడచీపురుపల్లి. ఈ పంచాయతీ పరిధిలో 11 శివారు గ్రామాలు ఉన్నాయి. పంచాయతీలో 11300 జనాభా ఉంది. మండల కేంద్రానికి 11 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. గతంలో ఏపని కావాలన్నా 11 కిలోమీటర్ల దూరంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది.ఇక్కడ అధికశాతం ప్రజలు వ్యవసాయం, పశు పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంతో ప్రధాన పంచాయతీ, శివారు గ్రామాల ప్రజలు విద్యుత్, తాగునీరు, రహదారుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

నేడు పరిస్థితులు పూర్తిగా మారాయి. పంచాయతీలోనే సేవలు అందుతున్నాయి. సంక్షేమ పథకాలు ఇంటికే చేరుతున్నాయి. ఎరువులు, విత్తనాలు కావాలన్నా గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోనే లభిస్తున్నాయి. వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోనే మినీ మండల సముదాయం ఏర్పాటు చేసి పంచాయతీ రూపురేఖలు మార్చారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కళ్ల ముందే ఎంతో మార్పు

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో వాడచీపురుపల్లి గ్రామ పంచాయతీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గ్రామం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంది. ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు గ్రామంలోనే అందుతున్నాయి. మౌలిక సదుపాయాలు కల్పించి జగనన్న తమ ఇబ్బందులు తొలగించారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల అభివృద్ధి

వాడచీపురుపల్లి-ఇస్సన్నపేట గ్రామాల మధ్య రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గొరుసువానిపాలెం, కూండ్రపు దొడ్డి గ్రామాలకు సీసీ రహదారులు వేశారు.

జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటి కుళాయిలు వేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు.

చేసిన పని	ఖర్చు చేసిన నిధులు
గ్రామ సచివాలయం-1	రూ. 25 లక్షలు
గ్రామ సచివాలయం-2	రూ.40 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ. 21.8 లక్షలు
పాఠశాలలు ఆధునికీకరణ	రూ. 84 లక్షలు
లైబ్రరీ, జిమ్ భవనం	రూ.16 లక్షలు
కమ్యూనిటీ టాయిలెట్స్	రూ. 16.5 లక్షలు
బల్క్ మిల్క్ సెంటర్	రూ.15.74 లక్షలు
గొల్లపేట జల్‌జీవన్ మిషన్ పనులకు	రూ.23.5 లక్షలు
ఇస్సన్నపేట బీటీ రోడ్డు నిర్మాణం	రూ.82.6 లక్షలు
ఎర్రన్నపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణం	రూ. 51.5 లక్షలు

అందుబాటులో సేవలు



గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరవాడ మండల కేంద్రానికి వెళ్లేవారం. వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడేవాళ్లం. తీరా వెళ్లిన తర్వాత పని పూర్తి కాకపోతే మళ్లీ వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడాపరిస్థితులు లేవు. గ్రామంలోనే అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇంటి పక్కనే లభిస్తున్న ప్రభుత్వ సేవలతో అవస్థలు తప్పాయి. జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు.

– పైల అమ్మాజీ, వాడచీపురుపల్లి

అవస్థలు తప్పాయి



మా గ్రామంలో నిత్యావసర వస్తువులు, ఇతర సరకులు ఏమీ దొరకవు. ఏ వస్తువు కావాలన్నా వాడచీపురుపల్లి వెళ్లాలి. చీకటిపడిన తర్వాతత మా గ్రామం ఇస్సన్నపేట వెళ్లడానికి సరైన రోడ్డు ఉండేది కాదు. గోతులతో నిండిన రోడ్డు మీదుగా గ్రామం వెళ్లడానికి అనేక అవస్థలు పడేవాళ్లం. గత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మా గ్రామానికి బీటీ రోడ్డు వేశారు. తారు రోడ్డు నిర్మాణంతో మా కష్టాలు తీరాయి. సంతోషంగా ఉంది.

– మానవరపు అప్పారావు, ఇస్సన్నపేట

పాఠశాలలు అభివృద్ధి చేశారు



ప్రాథమిక పాఠశాల మరమ్మతులతో అధ్వానంగా ఉండేది. ఆ పరిస్థితి చూసి గ్రామస్తులు ఎక్కువ మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపేవారు. ఫలితంగా పిల్లలతో పాటు మేము కూడా ఇబ్బంది పడేవారం. జగనన్న ప్రభుత్వం రాకతో నాడు-నేడు పథకంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రుల తరపున ప్రత్యేక కృతజ్ఞలు.

– దలాయి రాముడు, దలాయిపాలెం

ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యం



వాడచీపురుపల్లి గ్రామంలో ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి సమస్యలు వెనువెంటనే పరిష్కరిస్తున్నాం. ప్రతి నిత్యం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీలోని 16 మంచినీటి పథకాలకు ఎలాంటి మరమ్మతులు వచ్చిన వెనువెంటనే పరిష్కరించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తున్నాం.

– మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి,

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వినతి



రోడ్డు మరమ్మతులు చేపట్టాలని మేయర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని వేపగుంట-పినగాడి రోడ్డు చింతలగ్రహారం రైల్ ఓవర్ వంతెన వరకు మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ గోతులు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఆర్ అండ్ బీ నిధులు కేటాయించిందని., పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉందన్నారు. రోడ్డు ఆర్ అండ్ బీ పరిధిలో ఉన్నప్పటికీ తక్షణమే కనీసం మరమ్మతుల బాధ్యత జీవీఎంసీ తీసుకోవాలని కోరారు.

స్పందనకు ఆరు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమవతి

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం ఆరు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ కె.హేమవతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. జోన్-8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ డాక్టర్ విధానం భేష్

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు డిఫెన్స్ అధికారుల కితాబు



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఫెన్స్ అధికారులు బృందం

ఆనందపురం : కుటుంబ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉందని డిఫెన్స్ అధికారులు కితాబు ఇచ్చారు. ఎన్‌డీసీ సీనియర్ డైరెక్టర్ ఎం.కె. ఏవీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రక్షణశాఖ కళాశాల నుంచి 15 మంది డిఫెన్స్ అధికారులు మండలంలోని వేములవలసలో ఉన్న వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ భారత్)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ డాక్టర్ విధానం వలన ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇంటికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు, మందులు పంపిణీ, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షలు వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు పథకాలు అమలు తీరుని పరిశీలిస్తే అవగతమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లోని సౌకర్యాలు, మందుల నిల్వలు, సంచార వైద్య వాహనాన్ని పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వైద్య సేవలు సంపూర్ణంగా అందించడానికి సిబ్బందితో పాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయని సిబ్బంది, డిఫెన్స్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఉమాపతి, కోరాడ రాజబాబు, వైద్యురాలు షహనాజ్ సాదియా పాల్గొన్నారు.

ఏయూ ఆచార్యుడికి రెండు పేటెంట్‌లు



ఈశ్వర్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆచార్యుడు కె.ఈశ్వర్‌కుమార్‌కు రెండు భారతీయ పేటెంట్‌లు లభించాయి. తిరుపతి నుంచి విశాఖపట్నం మధ్యలో ఉన్న తూర్పు కనుమల్లోని ఔషధ మొక్కలపై చేసిన పరిశోధనకు ఈశ్వరకుమార్‌కు, పరిశోధకులకు ఈ పేటెంట్‌లు దక్కాయి. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందిచారు. ఏయూ ఐపీఆర్ కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 125 పేటెంట్ దరఖాస్తులు చేశామని, ఇప్పటి వరకు 6 పేటెంట్‌లు సాధించామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ డేగాలో సీ క్యాడెట్ కార్ప్స్



చేతక్ హెలికాప్టర్ గురించి వివరిస్తున్న ఐఎన్ఎస్‌డేగా అధికారి

గోపాలపట్నం: ఐఎన్ఎస్ డేగాలో 30 మంది సీ క్యాడెట్ కార్ప్స్ సందర్శించారు. ఇక్కడి పలు విభాగాల పని తీరును పరిశీలించారు. చేతక్ హెలికాప్టర్ ఏవిధంగా పని చేస్తుంది. ఏవియేషన్‌లో నిర్వహించే విధులను వీరికి వివరించారు. ఇక్కడి సాహసోపేతమైన, నైపుణ్యాలు, సృజనాత్మకత ఆవిష్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్‌డేగా అధికారులు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం తహసీల్దార్ చలమయ్య బాధ్యతల స్వీకరణ



చలమయ్య

సబ్బవరం: మండల నూతన తహసీల్దార్‌గా జె. చలమయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు సబ్బవరం తహసీల్దార్గా పని చేసిన సత్యనారాయణ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణ విభాగం సూపరింటెండెంట్గా బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తో పాటు మిగిలిన రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

పేకాట శిబిరంపై దాడి

ఏడుగురి అరెస్ట్, రూ.25 వేల నగదు స్వాధీనం

పెందుర్తి: వేపగుంట సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో జరుగుతున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,122 నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి..వేపగుంట సమీపంలోని ఓ తోటలో పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై సీపీ రవిశంకర్, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ వెంకటరావు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29లోగా కార్మిక శాఖ నుంచి లైసెన్స్ పొందాలి

సీతంపేట: జిల్లాలోని దుకాణదారులు, వాణిజ్య వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కార్మికశాఖ నుంచి లైసెన్స్ పొందాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ సర్కిల్-2 బుద్ధా మునిస్వామి పేర్కొన్నారు. దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, మోటార్ రవాణా వాహన యజమానులు, అంతరరాష్ట్ర వలస కార్మికులను వినియోగించే వారు కార్మిక చట్టం ప్రకారం విధిగా ఈ నెల 29లోగా రిజిస్ట్రేషన్ చేసి సర్టిఫికెట్ పొందాలన్నారు. కార్మిక చట్టాలన్నీ కలిపి ఒకే రిజిస్ట్రేషన్ పత్రం పొందే అవకాశం ఉందని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పొందిన వారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. గడువులోగా రిజిస్ట్రేషన్ పత్రం పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం



దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికులతో పాటు దేశ ప్రజలందరిపై ఉందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1089వ రోజు, సోమవారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడు తూ కార్మికుల పోరాట ఫలితంగా సాధించుకు న్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే దేశ ప్రజలెవరూ సహించరన్నారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం నేడు కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామన్నారు. పోరాట కమిటీ నాయకులు, బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



నులిపురుగుల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సాయిరాం

పరవాడ: మండలంలో భర్నికం శివారు బాపడుపాలెం ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల వైద్య శాఖ కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎం.ఎస్.ఎస్ సాయిరాం విద్యార్థులకు నులిపురుగుల వల్ల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు, కిశోర బాలలక ఆల్బెండజోల్ మాత్రలు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 9న ఉచితంగా అందజేస్తారని చెప్పారు. ఆ రోజుల్లో డీవార్మింగ్ చేయని పిల్లలు, కిశోర బాలలకు ఈ నెల 16న మాత్ర వేయాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు కళాశాలలు, పాఠశాలల్లో పంపిణీ చేస్తారన్నారు. మాత్ర గొంతులో ఇరుక్కోకుండా ఉండేందుకు బాగా చప్పరించి శుభ్రమైన తాగునీటితో కలిపి మింగాలని సూచించారు. నులిపురుగుల సంక్రమణ అధికంగా ఉన్న పిల్లలు, కిశోర బాలలకు మాత్ర వేసుకున్న తర్వాత వికారం, కొద్దిగా కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం లాంటివి కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ వాతావరణం కొంత సేపు మాత్రమే ఉండి తర్వాత తగ్గిపోతుందని కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర సహాయానికి 104 కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య సంరక్షణ అధికారి ఎం.ఎస్.సతీష్, లోవకుమారి, వరలక్ష్మి, పాఠశాల హెచ్ఎం టి.రాజశ్రీ, ఉపాధ్యాయుడు కె.గంగాధర్ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపుపై విద్యార్థులు దృష్టి పెట్టాలి

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఆంధ్రా బయో సమ్మిట్ ప్రారంభం



సదస్సును ప్రారంభించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యం పెంపు దృష్టి పెట్టాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ, టీ కాబ్స్-ఈ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి జీవ సదస్సు(ది ఆంధ్రా బయో సమ్మిట్)ను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను విశ్వనరులుగా తీర్చిదిద్దడంలో ఏయూ ముందంజలో ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్య ప్రత్యేకతను చాటాలన్నారు. ప్రయోగాత్మక, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, చైర్ ప్రొఫెసర్ పి.ఎస్.పి.ధనుంజయ్, ఆచార్య పద్దయ్య, టి.క్యాబ్స్-ఈ వ్యవస్థాపకుడు డాక్టర్ రవి, ఆచార్య సుజాత, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారి అనంత్ పర్వార్ సస్పెన్షన్

ఉక్కునగరం: విభాగాధిపతిను దుర్భాషలాడిన స్టీల్ ప్లాంట్ ఎల్‌అండ్‌డీసీ మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సస్పెండ్ చేసింది. తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడింగ్ తగ్గిందన్న కోపంతో పర్వార్ అదే విభాగం జీఎం ఎస్.భానును ఫోన్‌లో దుర్భాషలాడి ఆమెపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారు. ఈ మేరకు జీఎం భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్ ప్లాంట్ పోలీసులు పర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ రవిశంకర్ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అదే విధంగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై సత్వరం స్పందించాలంటూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు యాజమాన్యం పర్వార్‌పై చర్యలు తీసుకుంది. పర్వార్ సస్పెన్షన్‌పై ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హర్షం ప్రకటించారు.